శివమెత్తిన నది

రస్కిన్ బాండ్



బొమ్మలు :
యం. శ్రీకాంత్

శివమెత్తిన నది & నీలం రంగు గొడుగు

రచన : రస్కిన్ బాండ్

బొమ్మలు : యం. శ్రీకాంత్, పావని

అనువాదం : కె. సురేష్

మంచి పుస్తకం

శివమెత్తిన నది

కొండలలో పుట్టి, సముద్రంలో కలిసే ఆ పెద్ద నది మధ్యలో ఒక చిన్న దీవి ఉంది. నది ఆ దీవి చుట్టూ ప్రవహిస్తూ దాని అంచులను కొద్ది కొద్దిగా తనలో కలుపుకునేది. నది ఆ దీవిని ఇరవై ఏళ్ళ క్రితం ఒకసారి ముంచెత్తింది. అప్పుడు ఆ దీవి మీద ఎవ్వరూ లేరు. కానీ గత పది సంవత్సరాలుగా అక్కడ ఒక గుడిసె ఉంది – మట్టిగోడలు, వాలు కప్పు. ఒక పెద్దరాయి పక్కగా ఆ గుడిసె కట్టారు. దానికి మూడు వైపులా మట్టి గోడలుండగా నాలుగో వైపు ఆ రాయి ఉంది.

ఆ దీవి మీద పెరిగే కురచగడ్డిని, ముళ్ళపొదల ఆకులను మేకలు మేస్తూ ఉండేవి. కొన్ని కోళ్ళు కూడా ఆ దీవిలో ఉన్నాయి. ఒక పుచ్చ మడి, కూరగాయల మడి ఉన్నాయి.

ఆ దీవి మధ్యలో ఒక రావిచెట్టు ఉంది. ఆ దీవి మీద ఉన్న ఒకే ఒక చెట్టు అదే.

ఆ దీవిని ముంచెత్తిన పెద్ద వరదలో కూడా ఆ చెట్టు స్థిరంగా నిలిచి ఉంది.

అది చాలా ఏళ్ళు పైబడిన చెట్టు. యాభై ఏళ్ళ క్రితం బలమైన గాలులకు ఒక విత్తనం ఆ దీవి చేరింది. రెండు బండల రాళ్ళమధ్య దానికి ఆశ్రయం దొరికి వేళ్ళూనుకుంది. ఇప్పుడు ఒక చిన్న

కుటుంబానికి అది ఆశ్రయాన్ని, నీడను ఇస్తోంది. భారతీయులకు రావి చెట్టు అంటే ఎంతో ఇష్టం. ప్రత్యేకించి వేసవి కాలంలో హృదయాకారపు పలచటి ఆకులు ఏ కొంచెం గాలికైనా ఊగుతూ కిందనున్న వారికి హాయినిస్తాయి.

రావి చెట్టు పవిత్రమయినది కూడా. దానిపై దేవుళ్ళూ ఉంటారు, దెయ్యాలూ ఉంటాయి.

"రావి చెట్టు కింద కూర్చుని ఎప్పుడూ ఆవలించకు," సీత వాళ్ళ అమ్మమ్మ ఎప్పుడూ చెబుతూ ఉండేది. "ఒక వేళ ఆవలింత వస్తే నోటి ముందు చిటికె వెయ్యాలి. అలా చెయ్యకపోతే ఏదైనా దెయ్యం నీ గొంతులోకి దూకుతుంది!"

"అప్పుడేమవుతుంది?" సీత అడిగింది.

దెయ్యాలలో అంతగా నమ్మకంలేని తాతయ్య "ఏమవుతుంది. నువ్వు తిన్న అన్నం సరిగా అరగదు," అనేవాడు.

రావి ఆకు ఎంతో అందంగా ఉంటుంది. దానిని అమ్మమ్మ కృష్ణభగవానుడితో పోల్చేది – భుజాల దగ్గర వెడల్పుగా ఉండి సన్నని నడుముగా కొసదేలినట్లుంటుంది.

అది చాలా ముసలి చెట్టు. ఆ చెట్టుకింద తాతయ్య కూర్చుని ఉన్నాడు.

అతడు ఒక చేపల వల బాగుచేస్తున్నాడు. అతడు అనేక సంవత్సరాలుగా నదిలో చేపలు పడుతున్నాడు. అతడు మంచి నైపుణ్యం ఉన్న వేటగాడు. సన్నని రాగండి చేపలు, పెద్ద బొచ్చె చేపలు, బారుమీసాల కొర్రమీనులు ఎక్కడెక్కడ ఉంటాయో అతడికి తెలుసు. నది ఎక్కడ లోతుగా ఉందో, ఎక్కడ లోతు తక్కువగా ఉందో అతడికి తెలుసు. ఏ చేపకు ఏ ఎరను ఉపయోగించాలో



అతడికి తెలుసు – దేనికి పురుగులంటే ఇష్టమో, దేనికి శనగలంటే ఇష్టమో అతడికి తెలుసు. అతడు తన కొడుక్కి చేపలు పట్టటం నేర్పించాడు. కానీ ఆ కొడుకు వందమైళ్ళు దూరంగా ఉన్న ఫ్యాక్టరీలో పనికి కుదిరాడు. అతడికి మనవళ్ళు లేరు. కాని సీత అనే మనుమరాలు ఉంది. ఆమె మగపిల్లలు చేసే పనులన్నీ చెయ్యగలదు, కొన్ని పనులైతే వాళ్ళకంటే బాగా చెయ్యగలదు. సీత చిన్నప్పుడే తల్లి చనిపోయింది. ఆడపిల్ల చెయ్యవలసిన పనులన్నీ అమ్మమ్మ ఆమెకి నేర్పింది. మిగిలిన ఆడపిల్లలంత బాగా ఈ పనులన్నీ ఆమె చెయ్యగలదు. అయితే ఆమె తాతకిగానీ, అమ్మమ్మకిగానీ చదవటం, రాయటం రావు. ఫలితంగా ఆమెకీ చదవటం, రాయటం రావు.

ఏటి అవతల ఊరిలో ఒక బడి ఉంది. కాని సీత దానిని ఎప్పుడూ చూడలేదు. దీవి పైన ఎప్పుడూ ఎంతో పని ఉంటుంది.

చేపల వలను తాత బాగు చేస్తూ ఉండగా, గుడిసెలో జ్వరంతో వేడిగా ఉన్న అమ్మమ్మ తలను సీత చేతులతో పడుతోంది. మూడు రోజులుగా అమ్మమ్మ జ్వరంతో బాధపడుతూ ఏమీ తినలేకపోతోంది. అంతకు ముందు కూడా అమ్మమ్మ జబ్బు పడింది కానీ ఇంత చేటు ఎప్పుడూ లేదు. దగ్గరలోని పట్టణం నుంచి తాత ఆమె కోసం కమలా పండ్లు తెచ్చాడు. వాటి తొనల నుంచి ఆమె రసం పీల్చుకుంటోంది. అంతకు మించి ఆమె ఏమీ తినలేకపోతోంది.

తాతయ్య కంటే ఆమె చిన్నదే. కానీ జబ్బు మూలంగా తాతయ్య కంటే ముసలిదానిలాగా కనపడుతోంది. ఆమె ఎన్నడూ బలంగా లేదు.

అమ్మమ్మ నిద్రలోకి జారుకోవటం గమనించిన సీత చప్పుడు చెయ్యకుండా మునిగాళ్ళ మీద బయటకు వచ్చి నిలబడింది.

వర్షాకాలపు మబ్బులతో ఆకాశం కమ్ముకుని ఉంది. రాత్రంతా వాన కురిసింది. ఇప్పుడో, మరి కాసేపట్లోనో మళ్ళీ వాన కురిసేటట్లుంది. ఇప్పుడు జులై మధ్యలో ఉన్నారు. ఇప్పటికే నది నిండుగా ప్రవహిస్తోంది. ఉరకలెత్తుతూ అది చేసే శబ్దం ఎప్పటిమాదిరి కాకుండా భయం గొలుపుతూ ఉంది.

తాత దగ్గరికి వెళ్ళి అతడి పక్కనే రావి చెట్టుకింద సీత కూర్చుంది.

"నీకు ఆకలి వేసినప్పుడు చెప్పు," ఆమె అంది, "అప్పుడు నీకు రొట్టె చేసి పెడతాను."

"అమ్మమ్మ నిద్రపోయిందా?"

"నిద్రపోయింది. కానీ లోపల బాధ కారణంగా వెంటనే మేలుకుంటోంది."

నది ఆవలి ఒడ్డున ఉన్న అడవి వంక, నల్లగా కమ్ముకుంటున్న ఆకాశం వంక తేరిపార చూసి తాత "రేపటికి కూడా తగ్గకపోతే ఆమెను షాగంజ్‌లోని ఆసుపత్రికి తీసుకు వెళతాను. ఆమెకు ఎలా నయం చెయ్యాలో అక్కడి వాళ్ళకి తెలుస్తుంది. అప్పుడు నువ్వు ఒక్కదానివే కొన్ని రోజులు ఉండాల్సి ఉంటుంది. ఇంతకు ముందు కూడా నువ్వు ఒక్కదానివే ఉన్నావుగా," అన్నాడు.

సీత గంభీరంగా తల ఊపింది. తను వానాకాలంలో కూడా ఒంటరిగా ఆ దీవిపై ఉంది. అమ్మమ్మకు త్వరగా తగ్గిపోవాలని ఆమె కోరుకుంది. వేగంగా ప్రవహిస్తున్న నదిలో తమ చిన్న పడవలో అమ్మమ్మను నది దాటించే నైపుణ్యం తాతయ్య ఒక్కడికే ఉంది. తమకున్న కొద్దిపాటి వస్తువులు చూసుకోటానికి ఎవరో ఒకరు ఇక్కడ ఉండిపోవాలి.

ఒంటరిగా ఉండటానికి సీతకు ఎటువంటి భయమూ లేదు.

కానీ నది తీరు ఎందుకనో ఆమెకు నచ్చలేదు. ఈ రోజు ఉదయం నీటికోసం వెళ్ళినపుడు నీటి మట్టం పెరిగి ఉండటం ఆమె గమనించింది. నీటి కాకులు, కొంగలు, ఇతర నీటిపక్షుల రెట్టలతో నదీ తీరంలో కనబడే రాళ్ళు ఇప్పుడు కనబడటం లేదు.

ఇది ఏటా జరిగేదే... కానీ ఇంత తొందరగా ఆ రాళ్ళు నీటి కిందకి ఎప్పుడూ చేరలేదు.

"తాతా! నది మట్టం పెరిగితే ఏం చెయ్యను?"

"మెరక ప్రదేశంలోనే ఉండు."

"మెరక ప్రాంతానికి కూడా నీళ్ళు చేరుకుంటే?"

"కోళ్ళను గుడిసెలోకి తీసుకెళ్ళి అక్కడే ఉండు."

"నీళ్ళు గుడిసెలోకి కూడా వస్తే?"

"రావి చెట్టు ఎక్కు. అది చాలా బలమైన చెట్టు. అది పడిపోదు. నీళ్ళు రావిచెట్టును మించి ప్రవహించే అవకాశం లేదు!"

"అయితే మేకలను ఏం చెయ్యను తాతయ్యా?"

"వాటిని నాతోపాటు తీసుకెళతాను, సీతా. మీ అమ్మమ్మకు అవసరమయ్యే మంచి మందులు, ఆహారం కోసం వాటిని అమ్మవలసి రావచ్చు. అవసరమైతే కోళ్ళను ఇంటి కప్పుమీద ఉంచు. అయినా అంతగా ఆందోళన పడవద్దు," అతడు సీత తలను తట్టాడు, "నీళ్ళు అంత పైకి రావు. అయినా నేను వెంటనే తిరిగి వచ్చేస్తానుగా!"

"మరి అమ్మమ్మ తిరిగి రాదా?"

"అమ్మమ్మ కూడా తిరిగి వస్తుంది – అవసరమయితే మరి కొన్ని రోజులు ఆమె ఆసుపత్రిలో ఉండవలసి వస్తుందేమో."

* * *

సాయంత్రానికి వాన కురవసాగింది. పెద్దపెద్ద నీటి చినుకులు నదిని తాకుతున్నాయి. ఆ వాన చినుకులు వెచ్చగా ఉన్నాయి. సీత ఆ చినుకుల్లో తిరుగుతూ ఉంది. సీతకు వానలో తడవటం అంటే భయం లేదు, పైగా ఇష్టం కూడా. పోయిన నెలలో తొలకరి వానలు కురిసి ఆకుల దుమ్ము కడిగి, తడిసిన మట్టి వాసనను మోసుకొని వచ్చినప్పుడు ఆమె ఆనందంతో ఉరకలు వేసింది, కేకలతో పులకించి పోయింది. ఇప్పుడు వానలకు అలవాటు పడింది, కొంత అలసట చెందింది కూడా. కాని వానలో తడవటం ఆమెకేమీ అయిష్టంగా లేదు. గుడిసె లోపల చాలా ఉక్కపోతగా ఉంది. ఆమె పలచటి బట్టలు పొయ్యి సెగకి చిటికెలో ఆరిపోతాయి.

కాళ్ళకీ, పాదాలకీ ఏమీ లేకుండా ఆమె అటూ ఇటూ తిరిగింది. ఆమె కాళ్ళు ఆ ప్రాంతానికి అలవాటు పడిపోయాయి. ఎంతటి జారుడు రాయిమీదైనా, ఎంతటి పదునైన రాయిమీదైనా ఆమె కాలు పట్టు తప్పదు. సన్నగా ఉన్నప్పటికీ ఆమె బలం ఆశ్చర్యం గొలుపు తుంటుంది.

నల్లని జుట్టు ఆమె ముఖం మీద జాలువారుతోంది. నల్లని కళ్ళు, సన్నగా, దృఢంగా ఉన్న గోధుమరంగు చేతులు. తొడమీద పొడవాటి చార: చిన్నప్పుడు ఆమె కాలు పట్టుకుని ఒక దమ్ములగొండి లాక్కెళ్ళటానికి ప్రయత్నించినపుడు ఆ చార పడింది. ఆమె అరుపులకు అందరు లేచేటప్పటికి దమ్ములగొండి ఆమెను వదిలిపెట్టి పారి పోయింది.

వానలో అటూ ఇటూ తిరుగుతూ గుడిసె వెనక ఉన్న గూటిలోకి కోళ్ళను తోలుతోంది. ఎటువంటి అపాయం చెయ్యని ఒక గోధుమ రంగు పాము దాని కన్నంలోంచి బయటకువచ్చి పాకుతోంది. సీత

ఒక కర్ర తీసుకుని ఆ పామును పైకెత్తి ఒక రాళ్ళగుట్ట మధ్య పడేసింది. ఆమెకు పాములతో ఎటువంటి తగాదా లేదు. అవి కప్పలని, ఎలుకలని అదుపులో ఉంచుతాయి. ఈ దీవిలోకి మొట్టమొదటి పాము ఎలా చేరి ఉంటుందా అని ఆమె అబ్బురపడింది – బహుశా ఏ పడవలోనో, లేదా ఏ ధాన్యపు సంచిలోనో ఇక్కడకు వచ్చి ఉంటుంది. ఇప్పుడు వాటి సంఖ్య బాగా పెరిగిపోయింది.

అలసి లోపలికి వెళ్ళిన సీతకి ఆకలి వేసింది. కొన్ని బఠాణీలు తిని, కొద్దిగా మేకపాలు వెచ్చచేసుకుని తాగింది.

మధ్యలో అమ్మమ్మ ఒకసారి లేచి మంచినీళ్ళు కావాలని అడిగింది. ఆమె పెదాలకు తాత రాగి లోటా అందించాడు.

* * *

ఆ రాత్రి అంతా వాన కురిసింది.

ఇంటి కప్పు కారుతోంది. నేలమీద చిన్న మడుగు అయ్యింది. కిరసనాయిలు బుడ్డి వెలిగించి ఉంచారు. దాని అవసరం వాళ్ళకు లేదుగానీ అది వాళ్ళకి భద్రతా భావాన్ని ఇచ్చింది.

నదీ శబ్దం ఎప్పుడు వాళ్ళతోనే ఉంటుంది – దాని ఎరుక వాళ్ళకి ఉండకపోవచ్చు. కానీ ఆ రాత్రి నదీ శబ్దంలో తేడా వాళ్ళు గమనించారు. పొడవాటి చెట్ల చివర్లలో గాలి మాదిరిగా నది మూలుగుతోంది. బండరాళ్ళ చుట్టూ ప్రవహిస్తూ గులకరాళ్ళను తనతో తీసుకెళుతూ నది బుస కొడుతున్నట్లుంది. వదులైన మట్టి పెళ్ళలు నదిలో పడినపుడు అది గుడగుడమంటోంది.

సీత నిద్ర పోలేకపోయింది.

పాత గుడ్డలతో అమ్మమ్మ సాయం చెయ్యగా తయారుచేసుకున్న గుడ్డ బొమ్మ ఆమె దగ్గర ఉంది. ప్రతి రాత్రి అది తన పక్కన

ఉండాల్సిందే. నిద్ర రానపుడు, రాత్రులు దీర్ఘంగా అనిపించినపుడు సీత ఆ బొమ్మతో కబుర్లు చెప్పేది. అమ్మమ్మ, తాత కబుర్లు చెప్పటానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉండేవారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడు అమ్మమ్మ ఎన్నో మంచి కథలు ఎంతో చక్కగా చెప్పేది. అయితే అప్పుడప్పుడు సీతకి కొన్ని రహస్యాలు ఉండేవి. రహస్యాలు ఉండటం ఎంతో సరదాగా ఉంటుంది కాబట్టి ఏవీ లేనప్పుడు తనకు తానుగా సీత కొన్నింటిని ఊహించుకునేది. మరి రహస్యాలు ఉన్నపుడు వాటిని పంచుకోటానికి తన ఈడైన స్నేహితులు కూడా ఉండాలి కదా. ఆ దీవి మీద ఇంకెవరూ పిల్లలు లేకపోవటంతో సీత తన రహస్యాలను ఆ గుడ్డ బొమ్మతో పంచుకునేది. ఆ బొమ్మ పేరు మమత.

అమ్మమ్మ, తాత నిద్ర పోతున్నారు. కాని నది ఉరవడి, ఎంతో కష్టంతో తీస్తున్న అమ్మమ్మ ఊపిరి ఆగకుండా వినపడుతూ ఉన్నాయి.

చీకటిలో తన రహస్య సంభాషణను మొదలుపెడుతూ "మమతా! అమ్మమ్మ మళ్ళీ ఎప్పటికైనా కోలుకుంటుందంటావా?" సీత అడిగింది.

సీత ప్రశ్నలకు మమత ఎప్పుడూ బదులిస్తుంది. కాని ఆ సమాధానాలు ఒక్క సీతకే వినపడతాయి.

"ఆమె చాలా ముదుసలి అయిపోయింది," మమత అంది.

"నది ఈ గుడిసె వరకు చేరుకుంటుందంటావా?" అడిగింది సీత.

"ఇలాగే వాన కురుస్తూ, నదీ మట్టం పెరుగుతూ ఉంటే గుడిసెదాకా వస్తుంది."

"నది అంటే ఎందుకో కొంత భయం కలుగుతోంది మమతా. నీకు భయం వెయ్యటం లేదా?"

"భయపడకు. నది మనకి ఇప్పటిదాకా ఏ హానీ చెయ్యలేదు."

"నది గుడిసెలోకి వస్తే ఏం చేద్దాం?"

"కప్పు మీదకి ఎక్కుదాం."

"కప్పుదాకా వస్తేనో?"

"రావిచెట్టు ఎక్కుదాం. రావి చెట్టును మించి నది ఎప్పుడూ ప్రవహించలేదు."

ఉదయకాంతులు చూరులోంచి కొంచెం కనపడగానే సీత లేచి బయటికి వెళ్ళింది. వాన పెద్దగా కురవటం లేదు, తుప్పరలాగా పడుతోందంతే. కాని ఈ ముసురు వాన కొన్ని రోజులపాటు కురవవచ్చు. అంతే కాకుండా నది పుట్టిన కొండ ప్రాంతాల్లో పెద్ద వానలు పడుతూండవచ్చు.

ఆమె నది ఒడ్డుకు వెళ్ళింది. తాను ఎప్పుడూ కూర్చుని కాళ్ళు ఊపుతూ, నదిలో చేపలను చూస్తూ మురిసిపోయే తనకిష్టమైన బండరాయి ఆమెకి కనపడలేదు. అది అక్కడే ఉండి ఉంటుంది కానీ నది దానిమీదగా ప్రవహిస్తోంది.

ఆమె ఇసుక మీద నిలబడింది. ఆమె పాదాల వత్తిడికి కిందనుంచి నీళ్ళు బుడబుడమంటు పైకి రావటం ఆమె స్పర్శకు తెలుస్తోంది.

నది ఇప్పుడు తెలుపు చారతో ఆకుపచ్చ, నీలం రంగులలో లేదు. అది మట్టి రంగులో బురదగా ఉంది.

సీత గుడిసె దగ్గరికి తిరిగి వెళ్ళింది. ఆపాటికి తాత లేచి ఉన్నాడు. ప్రయాణానికి తమ చిన్న పడవని తయారుచేస్తున్నాడు.

సీత మేకపాలు తీసింది. మేకకి పాలు తియ్యటం ఇక ఇదే ఆఖరుసారి కావచ్చు అనుకుంది.

* * *

పడవలో తాత ప్రయాణం మొదలుపెట్టే సమయానికి సూర్యుడు బయటికి తొంగి చూస్తున్నాడు. పడవ ముందు భాగంలో అమ్మమ్మ కూర్చుని ఉంది. ఆమె ఏదో మాట్లాడదామని సీత వంక తదేకంగా చూస్తోంది. కాని ఆమె నోటివెంట ఎటువంటి మాటా రాలేదు. ఆశీర్వాదంగా ఆమె తన చెయ్యి ఎత్తింది.

సీత వంగుని అమ్మమ్మ కాళ్ళని తాకింది. తాత పడవని నీటిలోకి తోశాడు. వేగంగా ప్రవహిస్తున్న నది మీద ఇద్దరు మనుషులు, మూడు మేకలతో ఆ చిన్న పడవ మెల్లమెల్లగా ఆవలి ఒడ్డు వైపుకి వెళుతోంది. ఉన్నట్టుండి నది ఉధృతం పెరిగింది. కిందికి అరమైలు వెళ్ళిన తరువాత గాని తాత పడవని ఒడ్డుకి తిప్పలేడని సీత గ్రహించింది.

నది మీద పడవ పైకి, కిందకి ఊగుతూ దూరమవుతున్న కొద్దీ చిన్నగా కనపడుతోంది. విశాలమైన నది మీద చివరికి అది ఒక చిన్న చుక్కగా మారింది.

ఉన్నట్టుండి సీత ఒంటరిదైపోయింది.

వాన చినుకులను గాలి ముఖం మీదికి కొడుతూ ఉంది; దీవి చుట్టూ వేగంగా ప్రవహిస్తున్న నీరు ఉంది; దూరంగా, వాన కారణంగా మసకగా కనపడుతున్న నదీతీరం ఉంది; చిన్న గుడిసె ఉంది; చెట్టు ఉంది.

సీత పనిలో పడిపోయింది. కోళ్ళకు మేత వెయ్యాలి. వాటికి తిండి ధ్యాస తప్ప మరొకటి లేదు. గుప్పిళ్ళతో వాటికి గింజలు, ఆలుగడ్డ పొట్టు, వేరుశనగ తొక్కలు వేసింది.

తరువాత చీపిరి తీసుకుని గుడిసె శుభ్రం చేసింది. బొగ్గుల పొయ్యి అంటించి కొద్దిగా పాలు వేడి చేస్తూ "రేపు పాలుండవు..." అనుకుంది. ఉల్లిపాయల పొట్టు తియ్యసాగింది. వాటి పొగరుకి



కళ్ళు మంటపెట్టి నీళ్ళు కారుతుండటంతో పొట్టు తియ్యటం కాసేపు ఆపి నిశ్శబ్దంగా ఉన్న నదిని పరిశీలించింది. తాను ఒంటరినన్న భావన మరోసారి కలిగింది. తాత తాగే హుక్కా గొట్టం ఒక మూల ఉంది. సీత వాళ్ళ ముత్తాత కాలానికి చెందిన ఆ హుక్కా ఎంతో అందంగా ఉంటుంది. దాని పాత్ర కొబ్బరి చిప్పతో చేసి, వెండి రేకు తొడిగి ఉంటుంది. దాని గొట్టం మెలికలు తిరుగుతూ కనీసం నాలుగు అడుగుల పొడవైనా ఉంటుంది. వాళ్ళకున్న వస్తువులలోకెల్లా అదే విలువయినది. అమ్మమ్మ చేతి కర్ర మరో మూల ఉంది. అది శిస్సూ చెక్కతో చేసి ఎంతో దృఢంగా ఉంది.

మమత కోసం సీత చుట్టూ పరికించి చూసింది. అది మంచం కింద కనపడింది. దానిని తనకి దగ్గరలో పెట్టుకుంది.

కొండల నుంచి ఉరుములు వినపడసాగాయి. బూం- బూం- బూం....

"కొండ దేవతలకు చాలా కోపం వచ్చింది," అంది సీత, "వాళ్ళకి నేనంటే కోపమా?"

"నువ్వంటే వాళ్ళకి కోపం ఎందుకుండాలి?" మమత అడిగింది.

"వాళ్ళకి కోపం రావటానికి ఏ కారణమూ అవసరం లేదు. అన్నింటి పట్లా వాళ్ళకి కోపం. మనమేమొ వాటి మధ్యన ఉన్నాం. మనం చాలా చిన్నవాళ్ళం కదా... మనం ఇక్కడ ఉన్నామని వాళ్ళకి తెలుస్తుందా?"

"దేవుళ్ళు ఏమనుకుంటున్నారో ఎవరికి తెలుస్తుంది?"

"నేను నిన్ను చేశాను కదా. నువ్వు ఇక్కడ ఉన్నావని నాకు తెలుసుగా," సీత అంది.

"నది మట్టం పెరిగితే నువ్వు నన్ను కాపాడతావా?"

"ఓ, తప్పకుండా! నువ్వు లేకుండా నేను ఎక్కడికీ వెళ్ళను మమతా."

సీత ఎక్కువసేపు గుడిసెలో ఉండలేకపోయింది. తనతోపాటు మమతను తీసుకుని బయటికి వెళ్ళింది. ఆమె నదికి అవతలి వైపు ఏ ప్రమాదమూ లేని భూమి వైపు చూసింది. కాని అవతలి వైపైనా ఇప్పుడు భద్రంగానే ఉంటుందా? నది ఇప్పుడు చాలా విశాలంగా కనిపిస్తోంది. అది గట్లను దాటి మైదానాల్లో పరుచుకుంటోంది. దూరంగా ప్రజలు నెత్తిమీద, భుజాల మీద తమ సామానుతో ఇళ్ళను వదిలి నీటితో నిండిన పొలాలనుంచి గేదెలను తోలుతూ ఎత్తు ప్రదేశాలకు తరలి వెళుతున్నారు. ఎక్కడా క్షేమంగా లేదు.

తాత, అమ్మమ్మలు ఎలా ఉన్నారోనని కాసేపు తలపోసింది. వాళ్ళు ఒడ్డుకి క్షేమంగా చేరుకుంటే అయిదారు మైళ్ళు దూరంలో ఉన్న పట్టణానికి వెళ్ళటానికి ఎడ్లబండో, జట్కా బండో మాట్లాడాలి. ఆ పట్టణంలోనే కోర్టు, జైలు, సినిమా హాలు, ఆసుపత్రి ఉన్నాయి.

అమ్మమ్మని మళ్ళీ చూడగలుగుతానా అని సీత కాసేపు విచారించింది. తనకు చేతనైనంత బాగా చూసుకుంది. తనకి జ్వరం వచ్చినపుడు తన నుదుటిని చల్లగా తాకిన రోజులు, అమ్మమ్మ తనకి కథలు చెప్పిన రోజులు గుర్తుకు వచ్చాయి. అమ్మమ్మ తనకి ఎన్నో దేవతల కథలు చెప్పింది – చిన్ని కృష్ణుని కథలు, అతని అల్లరి, పశువులు, పక్షులు అతనితో స్నేహంగా ఉండటం; అతడి చేష్టల కారణంగా మిగతా దేవతల మధ్య రేగిన గందరగోళం; ఉరుములు, మెరుపుల సృష్టికర్త అయిన ఇంద్రుని కథలు; సృష్టిని కాపాడే విష్ణువు కథలు, అతడి వాహనమైన గరుడుని కథలు; ఏనుగు తల గణేశుని గురించి; లంకారాజుతో పోరాటంలో రాముడికి సహాయపడిన

వానరదేవుడు హనుమంతుడి గురించి ఇలా ఎన్నో కథలు చెప్పింది. మరిన్ని కథలు చెప్పటానికి అమ్మమ్మ తిరిగి వస్తుందా – లేక అవన్నీ తనకు తాను తెలుసుకోవాలా?

ఇప్పుడు దీవి మరింత చిన్నగా కనపడుతోంది. కొన్నిచోట్ల మట్టి అంచులు నదిలో పడి, కలిసి పోయాయి. కాని దీవి మధ్యలో రాతినేల ఉంది. ఈ రాళ్ళు నదిలోకి విరిగి పడిపోవు, నీటిమట్టం పెరిగితే మునిగిపోతాయంతే. ఈ రాతి ప్రాంతం మధ్యలో రావిచెట్టు పెరిగింది.

చుట్టూ పరిస్థితి పరికించటానికి ఆమె చెట్టు ఎక్కింది. ఆ చెట్టుపైకి గతంలో ఎన్నోసార్లు ఎక్కింది కాబట్టి పై కొమ్మల్లోకి చేరుకోటానికి ఆమెకి ఎంతోసేపు పట్టలేదు. వాన జల్లుకి అడ్డుగా చెయ్యి పెట్టుకుని ఆమె నది ఎగువ భాగం కేసి చూసింది.

అంతటా నీళ్ళే కనపడ్డాయి. ప్రపంచమంతా ఒక పెద్ద నదిగా మారినట్లుంది. అడవి ఉన్న ప్రాంతంలో చెట్లు కూడా నీటిలో పుట్టే మడ చెట్లు మాదిరి కనిపించాయి. నీళ్ళు నిండిన మేఘాలతో ఆకాశం కమ్ముకుని ఉంది. కొండల నుంచి ఆకాశం ఉరుముతుండగా నది దానిని అనుకరిస్తూ హూంకరిస్తున్నట్లుంది.

ఏదో పెద్ద వస్తువు ఉబ్బి ఉండి నీటి వేగంతో కొట్టుకు రావటం కనపడింది. అది మరింత దగ్గరగా రావటంతో సీత దానిని గుర్తించ గలిగింది – నీట మునిగి చనిపోయిన గేదె ఒకటి ప్రవాహానికి వేగంగా కిందికి కొట్టుకు పోతోంది.

అంటే ఎగువన ఉన్న గ్రామాలను వరదపోటు అప్పటికే ముంచెత్తిందన్నమాట. లేదా పెరుగుతున్న నదీ తీరానికి దగ్గర మైదానాల్లో ఆ గేదె మేస్తూ ఉండి ఉండాలి.



సీత భయాలు నిజమయ్యాయి – కొంతసేపటికి నీటి వెంట చెక్క ముక్కలు, చిన్న చెట్లు, పొదలు కొట్టుకు రావటం కనిపించింది. మరి కాసేపటికే ఒక కొయ్య మంచం నీటి వెంట కొట్టుకుపోతూ కనిపించింది.

తన చిన్న గుడిసెను చేరుకోటానికి నదికి ఇంకెంత సమయం పడుతుందో?

ఆమె చెట్టు దిగి కిందకి వస్తుండగా మరింత జోరుగా వాన కురవసాగింది. కోళ్ళను లోపలికి తరుముతూ ఆమె కూడా గుడిసెలోకి పరుగులు తీసింది. ఆ గుడిసెలో అమ్మమ్మ మంచం కిందకి కోళ్ళు చేరాయి. వాటన్నింటిని ఒక చోట ఉంచటమే ఇప్పుడు ఉత్తమమైన పని అనుకుంది సీత. అవి కూడా అక్కడ ఉంటే వంటరితనం కొంత తగ్గినట్లు ఉంది.

మూడు కోళ్ళు, ఒక పుంజు ఉన్నాయి. నది వాటిని భయ పెట్టటం లేదు, వాటికి కావలసిందల్లా తిండి. అప్పుడప్పుడు వాటికి సీత కొంత ఉల్లిపొట్టు వేస్తూ ఉంది.

గుడిసె తలుపు వేసేసి వానజోరును, నది హోరును రానివ్వ కుండా చేస్తే బాగుంటుందనిపించింది కానీ అప్పుడు నీటి మట్టం ఎంత వేగంగా పెరుగుతోందో తెలుసుకునే మార్గమేదీ ఉండదు.

మమతని తన చేతుల్లోకి తీసుకుని వాన ఆగిపోవాలని, నదిలో నీటి మట్టం తగ్గిపోవాలని ప్రార్థించసాగింది. ఇంద్రుడిని ప్రార్థించింది, అతడు తీరికలేని పనుల్లో ఉన్నాడేమొననుకుని ఇతర దేవుళ్ళను కూడా ప్రార్థించింది. అమ్మమ్మ, తాత క్షేమంగా ఉండాలనీ, తానూ క్షేమంగా ఉండాలనీ ప్రార్థించింది. ఎంతో కష్టం మీద తన క్షేమాన్ని అన్నిటి కంటే చివర ఉంచింది.

తనకోసం అన్నం ఒండుకోవాలి. కోసిన ఉల్లిపాయలు వేయించి కొంత పసుపు, కారం వేసింది. ఆ తరువాత ఒక మగ్గు నీళ్ళు, కొంత ఉప్పు, ఒక కప్పు మైసూరు పప్పు వేసి మూత పెట్టింది.

ఇదంతా చెయ్యటానికి సీతకి పది నిమిషాలు పట్టింది, పప్పు ఉడకటానికి అరగంట పడుతుంది.

బయటికి చూపు సారించేసరికి చెట్టు కింద రాళ్ళ మధ్యలో నీటి మడుగులు కనిపించాయి. అవి వాన నీళ్ళో, నది పొంగగా వచ్చిన నీళ్ళో ఆమె చెప్పలేకపోయింది.

అంతలో ఆమెకు ఒక ఉపాయం తట్టింది.

గుడిసె మూల ఒక ట్రంకు పెట్టె ఉంది. అది సీత తల్లిది. దాంట్లో చలి కాలంలో ఉపయోగపడే రజాయి తప్ప ఇంకేమీ లేవు. ఒక వేళ నది పొంగి దీవి మునిగే పరిస్థితి ఏర్పడితే విలువైన, ఉపయోగకరమైన వస్తువులను కాపాడటానికి వాటినన్నింటినీ ట్రంకుపెట్టెలో ఉంచి కొట్టుకు పోకుండా ఏదైనా బరువు పెడదామని అనుకుంది.

ముందు తాత హుక్కా ట్రంకులోకి వెళ్ళింది. ఆ తరువాత అమ్మమ్మ చేతికర్ర కూడా వెళ్ళింది. వంటకి ఉపయోగించే మసాలా దినుసుల డబ్బాలన్నీ దాంట్లోకి వెళ్ళాయి. గోధుమ పిండి ఉన్న ఒక పెద్ద డబ్బా, బరక పంచదార ఉన్న ఒక డబ్బా కూడా ట్రంకులో పెట్టింది. ఒకవేళ సీత చెట్టు ఎక్కి చాలా గంటలు గడపవలసి వచ్చినప్పటికీ కిందికి దిగిన తరువాత తినటానికి ఏదో ఒకటి ఉంటుంది.

తాతది తెల్లటి నూలుచొక్కా, అమ్మమ్మకి వంటి మీద కాకుండా ఉన్న ఒకే ఒక చీర కూడా ట్రంకులోకి వెళ్ళాయి. వాటికి కొంత

పసుపు మరకలు అయితే మాత్రమేమి, అవి ఎండుచేపల వాసన వస్తేనేమి – అన్నట్టు అవి కూడా కొద్దిగా దాంట్లోకి చేరాయి.

ట్రంకులో సామాను సర్దుతూ తన కాళ్ళను తాకుతున్న చల్లటి నీటిని ఆమె గమనించనేలేదు. ట్రంకు పెట్టెకు తాళం వేసి తాళం చెవిని రాతిగోడ మీద పైన పెట్టింది. ఆ తరువాత పొయ్యిమీద పప్పు తిప్పటానికి తిరిగింది. అప్పుడు గాని నీటిలో నడుస్తున్న సంగతి ఆమె గుర్తించలేదు.

కాళ్ళకిందకి నీళ్ళు చేరటంతో ఆమె కదలకుండా భయం గొలిపే చూపులు సారించింది. గడపలోంచి నీళ్ళు లోపలికి నెట్టుకు వస్తున్నాయి.

సీత కంగారు పడిపోయింది. ఆమె తన భోజనం గురించి, పొయ్యిమీద పప్పు గురించి మరిచిపోయింది. గుడిసెలోంచి బయటకు దూసుకువచ్చి చీలమండల లోతు నీటిలోనుంచి రావి చెట్టు వైపుకి పరుగు తీసింది. బాగా తెలిసిన ఆ చెట్టుగనక అక్కడ లేకపోతే ఆమె దారి తప్పి లోతైన నీటిలోనో, నదిలోనో పడిపోయి ఉండేది.

ఆమె వేగంగా చెట్టునెక్కి తనకి బాగా పరిచయం ఉన్న ఒక బలమైన కొమ్మ మీద భద్రంగా కూర్చుని తడిచిన ముంగురులను ముఖం మీద నుంచి వెనక్కి నెట్టింది.

* * *

తాను తొందరపడి మంచి పనే చేసానని ఆమె అనుకుంది. ఇప్పుడు నీళ్ళు గుడిసెను చుట్టుముట్టాయి. దీవిలో ఇప్పుడు ఎత్తైన కొన్ని ప్రాంతాలు మాత్రమే కనపడుతున్నాయి: కొన్ని రాళ్ళు, గుడిసెకు ఆధారంగా ఉండిన పెద్ద బండరాయి, కొన్ని ముళ్ళ పొదలున్న ఒక చిన్న గుట్ట.

కోళ్ళు గుడిసెలోంచి బయటికి రాలేదు. బహుశా ఇప్పుడు అవి మంచం ఎక్కి కూర్చున్నాయేమో.

నది మట్టం ఇంకా పెరుగుతుందా? ఇటువంటి పరిస్థితిని సీత ముందెన్నడూ చూడలేదు. నీళ్ళు తన చుట్టూ, అన్ని దిశలలో అనంతంగా వ్యాపించి ఉన్నాయి.

చనిపోయిన పశువులు నీటి ప్రవాహంలో కొట్టుకుని రాసాగాయి. రకరకాల వస్తువులు నీటిలో కొట్టుకొనిపోతూ కనపడ్డాయి – అల్యూమినియం కెటిల్, పేము కుర్చీ, పళ్ళపొడి డబ్బా, ఖాళీ సిగరెట్టు పెట్టె, ఒక్క పాంకోడు, ఒక ప్లాస్టిక్ బొమ్మ....

బొమ్మ!

గుండె జారిపోతుండగా సీతకు మమత గుర్తుకు వచ్చింది.

పాపం మమత! దానిని తను గుడిసెలోనే వదిలేసింది. కంగారులో తన ఒకే ఒక నేస్తాన్ని మరిచిపోయింది.

నేను తయారుచేసిన దాని పట్లే ఇంత అజాగ్రత్తగా ఉంటే నది మధ్యలో ఒంటరిగా ఉన్న తన గురించి దేవుళ్ళు పట్టించుకోవాలని ఎలా ఆశించగలను అనుకుంది సీత.

నీటి మట్టం పెరుగుతూ దీవి వేగంగా కనుమరుగు కాసాగింది.

ఒక వస్తువు తేలుతూ గుడిసెలోంచి బయటకు వచ్చింది.

అది ఖాళీ కిరసనాయిలు డబ్బా. దాని మీద ఒక కోడి కూర్చుని ఉంది. నీటి మీద డబ్బా పైకి కిందకి ఊగుతూ చెట్టుకి కొంత దూరంలో తేలుతూ వస్తోంది. అంతలో ప్రవాహ వేగంలో కలిసి డబ్బా వెంటనే నదిలో కలిసింది. కోడి ఇంకా పట్టు తప్పకుండా ఎలాగో దానిమీదే కూర్చుంది.

మరికొంత సేపటికి నీటి మట్టం మంచం దాకా వచ్చిందో

ఏమో మిగిలిన కోళ్ళు కూడా రాతిగోడ మీదకి ఎగిరి చూరులో ముణుక్కున్నాయి.

ఇప్పుడు నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. గుడిసెకు ఆధారమైన రాయి, గుడిసె కప్పు, రావిచెట్టు మాత్రమే దీవి అంతటిలో కనపడుతున్నాయి.

అది చాలా పెద్ద చెట్టు, దానికి ఎన్నో కొమ్మలు ఉన్నాయి. నది దాని ఎత్తును మించి ప్రవహించటం అసాధ్యం. కాని ఈ చెట్టు మీద ఎంత సేపు ఉండాలో అనుకుంది సీత. ఆమె మరి కొంత పైకి పాకింది. అదే సమయంలో ఒక అడవికాకి ఆమె కంటే పైనున్న కొమ్మల్లోకి వచ్చి వాలింది. సీత తలపైకెత్తి చూడగా పంగబారిన రెండు కొమ్మలమధ్య ఎండు పుల్లలతో తిక్కిరిబిక్కిరిగా పెట్టిన కాకి గూడు ఒకటి కనపడింది.

ఆ గూటిలో నీలం, ఆకుపచ్చ మచ్చలున్న నాలుగు గుడ్లు ఉన్నాయి. ఆ గుడ్ల మీద కూర్చుని కాకి ఆందోళనతో అరుస్తూ ఉంది. ఆ కాకి అరుపు కఠోరంగా ఉన్నా సీతకి కాస్త ఊరట లభించింది. కనీసం తను ఒంటరి కాదు. ఎవరూ లేకుండా ఉండటం కంటే కాకి తోడుగా ఉండటం మేలు.

గుడిసెలోంచి మరిన్ని వస్తువులు తేలుతూ బయటికి వచ్చాయి – ఒక పెద్ద గుమ్మడికాయ, తాతది ఒక పెద్ద తలపాగా, అది చుట్టు విప్పుకుంటూ ఒక పాములా తోచింది, ఆ తరువాత – మమత!

గడ్డి, చిత్రిక పొట్టుతో ఆ బొమ్మ నిండి ఉండటం వల్ల నీటిలో తేలుతూ వేగంగా పయనించసాగింది. అది రావిచెట్టుకి చాలా దగ్గరగా వచ్చింది. దానిని పిలిచి, చెట్టుని అందుకోమని అరవాలన్న కోరిక సీతకి కలిగింది. కాని మమతకి ఈదటం రాదని ఆమెకు

తెలుసు – ఆ బొమ్మ నీటిమీద తేలుతూ, నదీ ప్రవాహంతో పయనించి దిగువకి కొన్ని మైళ్ళ దూరం కొట్టుకు పోతోంది.

గాలికి, వానకి చెట్టు ఊగింది. కాకి అరుస్తూ పైకి ఎగిరి, చెట్టు చుట్టూ కొన్నిసార్లు తిరిగి మళ్ళీ గూటిలో వాలింది. కొమ్మనుంచి సీత పట్టు వదలలేదు.

అంత పొడవు చెట్టు ఒకసారి వణికింది. సీతకి అది భూమి ప్రకంపనంలాగా అనిపించింది. చెట్టుతో పాటు తనలోని ఎముకలు కూడా వణికినట్లనిపించింది.

ఇప్పుడు నది ఆమె చుట్టూ ప్రవహిస్తోంది. గుడిసె కప్పు చివరిదాకా నీళ్ళు వచ్చాయి. త్వరలోనే మట్టి గోడలు కూలిపోయి కరిగి పోతాయి. పెద్ద బండరాయి, ఎక్కడో దూరంగా కొన్ని చెట్లు తప్పించి ఎటు చూసినా నీళ్ళే.

నీట మునిగిన గ్రామ శిధిలాలను వదిలి ఒక పడవలో పయనమైన కొంత మంది సీతకు కొన్ని క్షణాలపాటు కనపడ్డారు. వాళ్ళల్లో ఒకరు తనవైపు చూపిస్తున్నట్లుగా అనిపించింది. అయితే నది వేగానికి పడవ కొట్టుకుపోతూ అంతలోనే కనుమరుగయ్యింది.

నది చాలా కోపంగా ఉంది. అది వినాశనం సృష్టిస్తున్న ఒక అడవి జంతువు మాదిరి, రాకాసి బల్లి మాదిరి ఉంది. అది కొండల మీద నుంచి గర్జించి దూకుతూ మైదానాల్లో వేగంగా ప్రవహిస్తోంది. దానితోపాటు చనిపోయిన పశువులు, పెకలింపబడ్డ చెట్లు, ఇంటి వస్తువులు, మట్టికి ఊపిరాడక చనిపోయిన పెద్ద చేపలు కొట్టుకు వస్తున్నాయి.

ఆ పొడవాటి ముసలి రావి చెట్టు మూలిగింది. ఎన్నో, ఎన్నో ఏళ్ళ క్రితం పుట్టిన దాని పొడవాటి వేళ్ళు మట్టిని పట్టుకుని ఉండాలని

విశ్వ ప్రయత్నం చేశాయి. కాని వాటి చుట్టూ మట్టి మెత్తబడుతోంది, రాళ్ళు కొట్టుకుని పోతున్నాయి. ఆ చెట్టు వేళ్ళు వేగంగా తమ పట్టు కోల్పోతున్నాయి.

ఏదో ముప్పు రాబోతోందని కాకి గ్రహించినట్లు ఉంది. అది ఎగురుతూ ఆచెట్టు చుట్టూ తిరుగుతూనే ఉంది. అది గూటిలోనూ వాలటం లేదు, అక్కడి నుంచి ఎగిరిపోనూ లేదు. తన గూడు ఉన్నంతవరకు కాకి అక్కడి నుంచి పోదు. ఆందోళనతో అరుస్తూ, అక్కడే ఎగురుతూ ఉంటుంది.

తడిచిన సీత బట్టలు ఆమె సన్నని వంటికి అతుక్కుపోయాయి. పొడవాటి ఆమె నల్లటి జుట్టు నుంచి వర్షపు నీరు కిందికి పారుతున్నాయి. చెట్టు ప్రతి ఆకునుంచి నీళ్ళు ప్రవాహాలెత్తుతున్నాయి. కాకి కూడా తడిచిపోయి దాని ఈకలు చిందర వందర అయ్యాయి.

చెట్టు మూలిగి మరోసారి కదిలింది. అది ఎన్నో వానాకాలాలను చూసింది. తన బలిష్టమైన మొదలు చుట్టూ ఎన్నో సంవత్సరాల క్రితం నది ఇలాగే ఉరకలెత్తినప్పుడు అది స్థిరంగా నిలబడింది. కాని అప్పుడది మంచి పరువంలో ఉంది.

ఇప్పుడు ముసలిది అయిపోయి, నిలబడి, నిలబడి అలసిపోయి నదితో కలిసి పోటానికి సిద్ధంగా ఉంది.

దాని అందమైన ఆకులు ఒక్కసారి ఊగి, వేళ్ళకింది మట్టి కదిలిపోవటంతో ఆ చెట్టు భూమిపై తన స్థానం వదిలి కిందికి వంగుతూ మెల్లగా ముందుకు కదల సాగింది. పక్కలకి ఊగుతూ, వేళ్ళను నేలమీద ఈడ్చుకుంటూ అది ముందుకు సాగుతోంది. ఆకాశాన్ని అంటుకోటానికి నది పైకి లేస్తున్నట్లు సీతకి అనిపించింది. నది ప్రవాహంలోకి చెట్టు చేరి సీతను అటూ ఇటూ ఊపుతూ కొంత

వేగంగా తేలుతూ పోసాగింది. ఇప్పుడు ఆమె కాళ్ళు నీటిని తాకుతున్నాయి. చెట్టు కొమ్మను పట్టుకుని సీత బితుకు బితుకుగా కూర్చుని ఉంది.

* * *

చెట్టు కొమ్మలు అటూ ఇటూ ఊగాయి. కానీ ఆమె తన పట్టు సడలించలేదు. సీతకు భయం వేసింది. వరద ఉధృతి, నది వెడల్పు ఆమెకు కనపడటం లేదు. కనపడుతుందల్లా చెట్టు చుట్టూ ప్రమాదంలా పొంచి ఉన్న వరద ప్రవాహమే.

చెట్టు చుట్టూ కాకి ఎగురుతూనే ఉంది. అది చాలా కోపంతో ఉంది. గూడు ఇంకా చెట్టులోనే ఉంది కానీ ఎంతోసేపు అలా ఉండదు... చెట్టు మరింత వంగి కొద్దిగా పక్కకి తిరిగింది, గూడు నీటిలోకి మునిగిపోయింది. ఒకటొకటిగా గుడ్లు నీట మునగటం సీత చూసింది.

నీటి మీదకి కాకి ఉరికింది కానీ అది చెయ్యగలిగింది ఏమీ లేదు. మరి కొన్ని నిమిషాలలో గూడు కూడా మాయమయ్యింది.

ఇంకా చెట్టు మీద ఏదో మిగిలి ఉన్నట్లు ఆ కాకి ఒక యాభై గజాల దాకా చెట్టు వెంటే ఎగిరింది. ఆ తరువాత రెక్కలు ఆర్చుతూ పైకి ఎగిరి నదికి అటువైపుకి పోయి కనుమరుగయ్యింది.

సీత మళ్ళీ వంటరిదయ్యింది. కానీ ఈసారి వంటరితనం అనుభూతి చెందే అవకాశం లేదు. ప్రతిదీ కదలికలో ఉంది – పైకి, కిందకీ, పక్కలకీ, ముందుకి చెట్టు కదులుతోంది. "ఏ క్షణంలోనైనా చెట్టు తిరగబడి నేను నీళ్ళల్లో పడిపోతాను," అనుకుంది సీత.

పక్కగా ఈదుకుంటూ వెళుతూ ఒక తాబేలు కనపడింది. అది నదుల్లో ఉండే పెద్ద తాబేలు. చచ్చి కుళ్ళుతున్న చేపలు దాని ఆహారం.

సీత తన ముఖం ఇంకోవైపుకి తిప్పుకుంది. దూరాన వరదకి గురయిన గ్రామం, బల్లకట్టు మీద ప్రజలు కనపడ్డారు. కాని వాళ్ళు చాలా దూరంగా ఉన్నారు.

చెట్టు చాలా పెద్దది కావటం వల్ల నదిలో అంతవేగంగా అది ముందుకు వెళ్ళటం లేదు. ఒక్కొక్కసారి లోతు తక్కువ నీటిలోకి వెళ్ళినప్పుడు దాని వేళ్ళు అడుగున రాళ్ళకు తట్టుకుని ఆగిపోయేది. కానీ ఎక్కువసేపు అలా ఉండేది కాదు. నదీ ప్రవాహ వేగానికి అది తిరిగి ముందుకు సాగిపోయేది.

ఒకచోట నది ఒంపుగా ఉండి అడుగున ఇసకలోకి చెట్టు దిగి ఆగిపోయింది.

సీత బాగా అలసిపోయింది. ఆమె చేతులు నొప్పి పుడుతున్నాయి. ఆమె నిటారుగా కూర్చోలేకపోతోంది. చెట్టు పక్కకి వరగటంతో పడిపోకుండా ఉండటానికి గట్టిగా పట్టుకోవలసి వస్తోంది. ముసురు పట్టి కురుస్తున్న ఆకాశం మెరుస్తున్న పెద్ద కప్పులాగా కనపడుతోంది.

తనున్న పరిస్థితిలో ఎక్కువ సేపు అలా ఉండలేనని ఆమెకి అర్థమయ్యింది. దూరంగా ఉన్న ఏ ఇంటి కప్పు మీదకో, చెట్టు మీదకో చేరుకోటానికి ఈది చూడటం మంచిది అనుకుంది. అప్పుడు ఎవరో పిలవటం ఆమెకి వినిపించింది. మెడచాచి నది ఎగువ భాగం వైపుకి చూడగా తిన్నగా తనవైపుకే వస్తున్న ఒక చిన్న పడవ కనిపించింది.

చెట్టు దగ్గరికి పడవ చేరుకుంది. అందులో ఒక అబ్బాయి ఉన్నాడు. అతడు ఒక చేతితో చెట్టుకొమ్మను పట్టుకుని నిలదొక్కుకుని రెండో చెయ్యి సీతకి ఇచ్చాడు.

ఆమె దానిని అందుకుని అతడి పక్కగా పడవలోకి జారింది.

ఆ అబ్బాయి తన కాలిని చెట్టు మొదలుకు తన్నిపెట్టి పడవని నీటిలోకి నెట్టాడు.

ఆ చిన్న పడవ నదిలో వేగంగా ప్రయాణించసాగింది. వెనక ఎక్కడో ఆ పెద్ద చెట్టు ఉండిపోయింది. మళ్ళీ దానిని చూడను అనుకుంది సీత.

* * *

ఆమె పడవలో వెల్లికిలా పడుకుని ఉండిపోయింది. కనీసం మాట్లాడటానికి కూడా ధైర్యం చాలటం లేదు. ఆ అబ్బాయి ఆమెను చూశాడు కానీ ఏమీ మాట్లాడలేదు. అతడు నవ్వను కూడా నవ్వలేదు. పడవ నది మధ్యలోకి వెళ్ళకుండా చిన్న తెడ్డులను వేస్తూ ఆపు తున్నాడు. వేగంగా ఉన్న ప్రవాహం నుంచి పడవని తప్పించటానికి తగినంత బలం అతడికి లేదుకానీ అతడు ప్రయత్నిస్తూ ఉన్నాడు.

ఎల్లలు లేని నది, మైదానాల్లో అన్ని దిశలా వ్యాపించిన నది. ఆ పెద్ద నదిలో ఒక చిన్న పడవ. ఉరకలెత్తే నీటిలో పడవ వేగంగా ముందుకు వెళుతోంది. సీత వాళ్ళ ఇల్లు ఎక్కడో దూరంగా ఉండిపోయింది.

ఆ అబ్బాయి మొలకి ఒక గోచీ మాత్రమే ఉంది. మొలతాడుకి ఒర ఉన్న చిన్న బాకు కట్టి ఉంది. అతడు సన్నగా, తీగ మాదిరి ఉన్నాడు. పొట్ట బల్లపరుపుగా ఉంది. బుగ్గల ఎముకలు ఎత్తుగా ఉన్నాయి. ఆరోగ్యంగా ఉన్న తెల్లటి పలువరుస ఉంది. అతడు సీత కంటే కొంచెం నల్లగా ఉన్నాడు.

నది వెడల్పు ప్రాంతానికి వచ్చి కొంత ప్రశాంతంగా ప్రవహిస్తుండటంతో అతడు తెడ్లు వెయ్యటం ఆపి పడవని నీటి మీద తేలుతూ పోనిచ్చాడు. "నువ్వు ఆ దీవి మీద ఉంటావు కదూ,"



చివరికి అతడన్నాడు, "నేను నిన్ను కొన్నిసార్లు చూశాను. మరి మిగతా వాళ్ళు ఏరి?"

"మా అమ్మమ్మకి జబ్బు చేసింది. తాత ఆమెని షాగంజ్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్ళాడు," సీత బదులిచ్చింది.

"వాళ్ళు ఎప్పుడు వెళ్ళారు?"

"ఈ రోజు ఉదయమే."

అవును ఈ రోజు ఉదయమే వాళ్ళు బయలుదేరారు. కాని సీతకి అది జరిగి ఎన్నో రోజులయినట్లుంది.

"నువ్వు ఎక్కడి నుంచి వచ్చావు?" ఆమె అతడిని అడిగింది. అంతకు ముందెన్నడూ ఆమె అతన్ని చూడలేదు.

"నేను..." అతడు కొంచెం తటపటాయించాడు. "కొండల దిగువ ప్రాంతం నుంచి వచ్చాను. ఒక ఊరిలోకి వరద నీళ్ళు బాగా వచ్చాయన్న వార్తను ఏటి అవతలికి చేరుద్దామని బయలుదేరాను. కాని వరద ఉధృతి చాలా ఎక్కువగా ఉంది. మీరుంటున్న దీవి పక్కగా నేను కొట్టుకు వచ్చాను. మనం నదితో పోరాడలేం. అది మనల్ని ఎక్కడికి తీసుకుపోతుందో అక్కడికి వెళ్ళవలసిందే."

"నువ్వు అలిసిపోయుంటావ్. నాకు ఆ తెడ్లు ఇవ్వు."

"లేదు. అయినా ఇప్పుడు పడవను నిలకడగా ఉంచటానికి మించి చెయ్యవలసింది ఏమీ లేదు."

ఒక చేత్తో తెడ్డు వేస్తూ రెండో చేత్తో చెక్క కింద ఉన్న బుట్టను పట్టుకున్నాడు. అందులోంచి రెండు మామిడి పండ్లు బయటకి తీసి ఒకటి సీతకి ఇచ్చాడు.

బాగా పండి ఉన్న ఆ పండ్లను కొరికి తోలు లాగి వేశారు. తీపిగుజ్జు వాళ్ళ బుగ్గలవెంట కారింది. ఆ పండు రుచి, వాసన

అద్భుతంగా ఉన్నాయి – అమృతం అంటే నిజంగా ఇదే. మామిడి పండు రుచి చూసి సీతకు సంవత్సరంపైనే అయ్యింది. కొన్ని క్షణాలు వరద గురించి మరిచిపోయింది – ఆ మామిడి పండు తినటంలో నిమగ్నమయ్యింది!

మైదాన ప్రాంతాల్లో కిందకి వెళుతున్న కొద్దీ నది ఉధృతం తగ్గి, పడవ వేగం కూడా తగ్గి మెల్లగా నీటి వెంట పయనిస్తోంది.

"నా పేరు కిషన్," ఆ అబ్బాయి అన్నాడు, "మాకు చాలా ఆవులు, గేదెలు ఉన్నాయి. కాని వరదకు వాటిల్లో చాలా కొట్టుకు పోయాయి."

"నువ్వు బడికి వెళతావనుకుంటాను," అంది సీత.

"బడికి వెళ్ళాలనే అంటారు. మా ఊరికి కొంత దూరంలో ఒక బడి ఉంది. నువ్వు కూడా బడికి వెళతావా?"

"లేదు – ఇంటి వద్ద చాలా పని ఉంటుంది."

ఇంటి వద్ద ఉంటే బాగుండేది అనుకుని ప్రయోజనం లేదు – అక్కడ ఇక ఇల్లు కూడా మిగిలి ఉండదు. కాని ఆ క్షణంలో తినటానికి మరో మామిడి కాయ ఉంటే బాగుండును అనుకుంది.

సాయంత్రం అయ్యేసరికి నది రంగు మారిపోయింది. పడమర వైపుకి వాలుతున్న సూర్యుడు మబ్బుల్లోనుంచి బయటికి వచ్చాడు. నది బూడిద నుంచి బంగారు రంగుకి, బంగారం నుంచి నారింజ రంగుకి మెల్లగా మారింది. సూర్యుడు కుంగిపోయేసరికి ఈ రంగులన్నీ నీటిలో ఇంకిపోయి నది రాత్రి రంగు పులుముకుంది.

చంద్రుడు దాదాపు నిండుగా ఉన్నాడు. ఆ వెన్నెలలో సీత నది అవతలి ఒడ్డున పెరుగుతున్న చెట్లను చూడగలిగింది.

"ఆ చెట్లవైపుకి చేరుకునే ప్రయత్నం చేస్తాను," అన్నాడు కిషన్. "రాత్రంతా పడవలో ప్రయాణం చెయ్యటం అంత మంచిది కాదు."

అలా అంటూ చెట్లవైపు తెడ్లు వెయ్యసాగాడు. పది నిమిషాలు శ్రమ పడిన తరువాత నది మలుపు వద్ద ప్రధాన ప్రవాహం ఒరవడి నుంచి బయటపడగలిగారు.

కొద్ది నిమిషాల్లో వాళ్ళు అడవి మధ్యలో ఉన్నారు. పొడవాటి చెట్ల మధ్య అతడు తెడ్లు వేస్తూ పడవను నడిపిస్తున్నాడు.

* * *

చెట్ల మధ్య పడవ మెల్లిగా వెళుతోంది. చంద్రుడి కిరణాలు నీటిపై ప్రతిబింబిస్తూ వాళ్ళకి దారి చూపిస్తున్నాయి.

"ఈ చెట్లలో ఒకదానికి పడవని కట్టేద్దాం," అన్నాడు కిషన్, "అప్పుడు రాత్రికి మనం విశ్రాంతి తీసుకోవచ్చు. రేపు మనం అడవి నుంచి బయటపడే మార్గం వెతకాలి."

ఇలా అంటూ అతడు పడవలోంచి ఒక పొడవాటి తాడు బయటికి తీశాడు. తాడు ఒక వైపున పడవ కొసకు కట్టి రెండవ వైపున కిందగా ఉన్న ఒక చెట్టు కొమ్మ మీదకి విసిరి కట్టాడు. చెట్టు మొదలకు చేరి పడవ ఆగిపోయింది.

అది బలంగా, పొడవుగా పెరిగిన మహాగని చెట్టు. ఇక్కడ నీటి ప్రవాహం వేగంగా లేదు కాబట్టి ప్రమాదమేమీ ఉండదు. చెట్లు చాలా దగ్గరగా ఉండటం వల్ల నీటికింద మట్టి కొట్టుకు పోతుందన్న భయమూ లేదు.

అయితే అడవి జంతువులు చెల్లాచెదరయ్యాయి. వాటి బొరియలు, గుహలు, నివాసాలు నీటితో నిండిపోవటం వల్ల పొడి ప్రాంతాన్ని, ఆశ్రయాన్ని వెతుక్కుంటూ అవి తిరుగుతున్నాయి.

పడవని ఒక చెట్టుకి కట్టెయ్యటం సీత, కిషన్ పూర్తి చేశారో లేదో ఒక పెద్ద కొండచిలువ నీటిలో వాళ్ళ వైపుకి ఈదుతూ వస్తోంది.

అది పడవలోకి ఎక్కటానికి ప్రయత్నిస్తుందేమోనని సీత భయపడింది కాని అది వాళ్ళ పక్కనుంచి ఈదుకుంటూ పోయింది. తల మాత్రం నీటినుంచి బయటికి పెట్టి తన పొడవాటి శరీరం ఊపుకుంటూ చీకటిలో కలిసి పోయింది.

కిషన్ బుట్టలో మరిన్ని మామిడి పండ్లు ఉన్నాయి. పడవలో కూర్చుని అతడు, సీత ఆవురావురుమంటూ వాటిని తినసాగారు.

ఒక పెద్ద దుప్పి నీటిలో తపతపలాడుతూ వచ్చింది. అది చాలా పెద్దగా ఉండటం వల్ల దాని తల, భుజాలు నీళ్ళ బయటే ఉండి అది ఈదవలసిన అవసరం లేకపోయింది. దాని కొమ్ములు పెద్దగా, అందంగా ఉన్నాయి.

"మరిన్ని జంతువులు వస్తాయి," అంది సీత. "మనం చెట్టు మీదకి ఎక్కుదామా?"

"పడవలో మనకి ఎటువంటి భయమూ లేదు," అన్నాడు కిషన్. "జంతువులు పొడి ప్రాంతాన్ని చేరుకునే ప్రయత్నంలో ఉన్నాయి. ఈ రాత్రి అవి ఒక దానిని మరొకటి కూడా వేటాడవు. ఈ రోజు పులి అన్నా, చిరుత అన్నా జింకలు భయపడవలసిన పనిలేదు. కాబట్టి పడుకుని నిద్రపో. నేను కాపలా ఉంటాను."

సీత పడవలో కాళ్ళు జాపుకుని కళ్ళు మూసుకుంది. బయట పడవను తాకే అలల శబ్దానికి ఆమె నిద్రపోయింది. ఒక వింత పిట్ట అరుపుకి ఆమెకు మెలకువ వచ్చింది. మోచెయ్యి కింద ఆనించి ఆమె పైకి లేచింది. కిషన్ మెలకువగా ఉండి ఏమి భయం లేదన్నట్లు నవ్వుతూ ఉన్నాడు. చంద్రుని కాంతిలో అతడు కృష్ణ భగవానుడి మాదిరి నీలంగా కనపడ్డాడు. ఆ అబ్బాయి నిజంగా కృష్ణుడేనేమోనని ఒక క్షణంపాటు అబ్బుర పడింది. కాని దాని గురించి ఆలోచించగా



అది అసాధ్యమనిపించింది. అతడు మామూలు పల్లెటూరి పిల్లవాడు. అతడిలాంటి వాళ్ళను ఆమె వందలాది మందిని చూసింది – అచ్చంగా అతనిలాంటి వాళ్ళు కాదులే. అతడిలో ఏదో ప్రత్యేకత ఉంది, అదేమిటో తాను చెప్పలేకపోతోంది.

మళ్ళీ నిద్రపట్టి ఆ అబ్బాయి, కృష్ణుడూ ఒకటేనని కలగన్నది. అతని వెనక తను ఒక పెద్ద తెల్ల పక్షిమీద కూర్చుని కొండల మీదుగా, మంచుతో కప్పబడిన హిమాలయ శిఖరాల మీదుగా మబ్బులలో దేవతల లోకానికి చేరుకున్నారు. దీనంతటికి దేవతలు కోపగించు కున్నట్లు ఒక పెద్ద ఉరుములాంటి శబ్దం వినపడింది. ఈ శబ్దానికి ఆమె లేచి చుట్టుపక్కల పరికించింది. ఎదురుగా వెన్నెలలో ఒక ఏనుగు పిల్ల నిలబడి ఉంది. దాని పొట్టదాకా నీళ్ళు వచ్చాయి. అది దారితప్పి, అమ్మకోసం వెతుక్కుంటోంది. తన పరిస్థితిని తెలియచేస్తూ తొండం ఎత్తి ఘీంకరించింది.

ఏనుగుపిల్ల మరొకసారి ఘీంకరించి తల కిందకి వంచి వినసాగింది. ఎక్కడో దూరం నుంచి మరో ఏనుగు వేసిన తీవ్ర ఘీంకారం వినిపించింది. అది ఈ గున్న ఏనుగు తల్లే అయ్యి ఉంటుంది. ఎందుకంటే ఆ అరుపు విన్న పిల్ల ఏనుగు సంతోషంతో పలుమార్లు ఘీంకరిస్తూ అరుపు వినవచ్చిన వైపుకి పరుగులు తీయసాగింది. దాని తాకిడికి లేచిన అలలకి పడవ అటూ ఇటూ ఊగింది. "ఇప్పుడిక ఏ ప్రమాదమూ లేదు," అన్నాడు కిషన్, "నువ్వు మళ్ళీ నిద్ర పోవచ్చు."

"మళ్ళీ నిద్ర పడుతుందనుకోను," అంది సీత.

"అయితే నీకు వేణువు ఊది వినిపిస్తాను," అన్నాడు ఆ అబ్బాయి, "అప్పుడు సమయం మరింత త్వరగా గడిచిపోతుంది."

పడవ అడుగునుంచి ఒక వేణువు తీసి తన పెదవులకు ఆనించి

ఊదసాగాడు. సీత అంతకు ముందెన్నడూ విననటువంటి తియ్యటి సంగీతం ఆ వేణువునుంచి ప్రవహిస్తూ తన అందమైన రవళితో ఆ అడవిని నింపుతున్నట్లు అనిపించింది. ఆ సంగీతం ఆధారంగా ఆమె మరోసారి కలల లోకానికి చేరుకుంది. ఆ నీలమేఘశ్యాముడు, తాను తెల్లపక్షి మీద సవారి చేస్తూ మబ్బులు, మంచులో విహరిస్తున్నారు. ఉన్నట్లుండి నల్లటి మేఘాలనుంచి సూర్యుడు పొడుచుకు వచ్చాడు. అదే సమయంలో సీత కళ్ళు తెరిచి మహాగని చెట్టు కొమ్మల్లోంచి వస్తున్న సూర్య కిరణాలను చూసింది. వెనక నీలి ఆకాశంతో ఆ చెట్టు ఆకులు అందంగా కనపడుతున్నాయి.

సీత ఒక్కసారి లేచి కూర్చోవటంతో పడవ అటూ ఇటూ ఊగిసలాడింది. ఆకాశంలో మబ్బులేమీ లేవు. చెట్లు సూర్యకాంతిలో తడిసిపోతున్నాయి.

కిషన్ పడవలో నిద్రపోతున్నాడు. తెరచి ఉన్న అతని అరచేతిలో వేణువు ఉంది. అతడి గోధుమరంగు కాళ్ళపై సూర్యకిరణాలు ఏటవాలుగా పడుతున్నాయి. ఒక ఆకు అతడి ముఖం మీద పడింది కానీ అతడికి మెలుకువ రాలేదు. అది అతడి బుగ్గమీద పడి అక్కడే చిగురు తొడిగినట్లు కనపడుతోంది.

అతడికి మెలకువ రాకుండా సీత కదలకుండా కూర్చుని ఉంది. నీటి మట్టం తగ్గినట్టు అనిపించటం లేదు కాని అది పెరగను కూడా పెరగలేదు. అంటే వరద ఉధృతి తగ్గిపోయిందన్నమాట.

కిషన్ శరీరం పైకి ఎండ పాకటంతో వేడెక్కి చివరికి అతనికి మెలకువ వచ్చింది. అతడు ఆవలించి, వళ్ళు విరుచుకుని లేచి సీత పక్కన కూర్చున్నాడు.

"నాకు ఆకలిగా ఉంది," అతడు నవ్వుతూ అన్నాడు.

"నాకూను," అంది సీత.

"చివరి మామిడి పళ్ళు," అంటూ అతడు బుట్టలో మిగిలి ఉన్న రెండు మామిడి పండ్లు బయటికి తీశాడు.

పండు తిన్న తరువాత టెంకెను శుభ్రంగా చీకారు. వాటిని పారవెయ్యగా అవి నీటిమీద చక్కగా తేలుతూ పోతున్నాయి. కాగితం పడవలకంటే మామిడి టెంకలనే నీటిమీద విడవటానికి సీత ఎప్పుడూ ఇష్టపడేది.

"మనం బయలుదేరటం మంచిది," అన్నాడు కిషన్.

చెట్ల మధ్యగా తిప్పుతూ, తెడ్లు వేస్తూ అతడు పడవ నడపసాగాడు. వానకి తడిసిన చెట్లు ఆకులు నీళ్ళు కారుస్తూ ఉండగా వరద నీటితో నిండిన అడవిలో ఒక గంటసేపైనా ప్రయాణం చేశారు. అప్పుడప్పుడు అడ్డంగా ఉన్న తీగలు, లతలు తొలగించటానికి తెడ్లు ఉపయోగించవలసి వచ్చేది. ఒక్కొక్కసారి నీట మునిగిన పొదలు వాళ్ళకు అడ్డం పడేవి. ఎలాగైతేనేం మధ్యాహ్నం కాకముందు వాళ్ళు అడవినుంచి బయట పడ్డారు.

ఇప్పుడు నీటి లోతు చాలా తక్కువగా ఉంది. వరద నీటితో నిండిన పొలాల మీదుగా పడవ తేలుతూ పోతోంది. దూరంగా వారికి ఒక ఊరు కనపడింది. అది ఎత్తైన ప్రదేశంలో ఉంది. వెనకటి రోజుల్లో ప్రజలు తమ ఇళ్ళను కొండలమీద కట్టుకునేవారు. దాని వల్ల వాళ్ళకి దండెత్తి వచ్చే సైనికుల నుంచి, బందిపోటు దొంగల నుంచి మంచి రక్షణ లభించేది. ఇది చాలా పాత ఊరు. అక్కడ ఉంటున్న వాళ్ళు కత్తులు విడిచి నాగళ్ళు చేతపట్టి చాలా సంవత్సరాలు అయ్యింది. ఎత్తు ప్రాంతంలో ఉండటం వల్ల వాళ్ళకి వరద వల్ల ఎటువంటి ముప్పు రాలేదు.



ఆ ఊరి ప్రజలు బలిష్టులు, పొడగరులు అయిన జాట్‌లు. వాళ్ళు ఎంతో ఉదారంగా నీట చిక్కిన ఆ పిల్లలకు ఆహారం, ఆశ్రయం ఇచ్చారు. అమ్మమ్మ, తాతలను చేరుకోవాలన్న ఆతురతతో సీత ఉంది. షాగంజ్‌లో పని ఉన్న ఒక ముసలి రైతు ఆమెను అక్కడికి తీసుకెళతానన్నాడు. కిషన్ కూడా తనతో వస్తాడని సీత ఆశించింది. కాని అతను అక్కడే వేచి ఉంటానని అన్నాడు. వరదలో చిక్కుకున్న అనేక మందితోపాటు తమ ఊరివాళ్ళు కూడా కొందరు అక్కడికి చేరుకుంటారని అతడికి తెలుసు.

"ఇప్పుడు నీకేం పర్వాలేదు," అన్నాడు కిషన్. "మీ తాత కూడా నీ కోసం ఆందోళన పడుతుంటాడు. కాబట్టి వీలైనంత త్వరగా నువ్వతన్ని చేరుకోవటం మంచిది. రెండు, మూడు రోజులలో నీళ్ళు తగ్గి మీరు దీవికి తిరిగి వెళ్ళగలుగుతారు."

"అసలు దీవే కొట్టుకుపోయిందేమో," సీత అంది.

రైతు కట్టిన ఎడ్లబండిలోకి ఆమె ఎక్కిన తరువాత కిషన్ ఆమెకి తన వేణువు ఇచ్చాడు.

"ఇది నీ దగ్గర ఉంచు," అతడన్నాడు, "దీని కోసం ఒక రోజు నీ దగ్గరకొస్తాను." ఆమె తటపటాయించటం చూసి కళ్ళల్లో కాంతులు మెరుస్తుండగా "ఇది మంచి వేణువు!" అన్నాడు.

* * *

ఎడ్ల బండి ప్రయాణం చాలా నిదానంగా సాగింది. దారి అంతా బురదగా ఉంది. బండి చక్రాలు మట్టిలో కూరుకుపోయేవి. రైతు, అతడి కొడుకు, సీత బండి దిగి దానిని బయటకు తొయ్యవలసి వచ్చేది. దారి నిండా నీటి మడుగులు ఉన్నాయి. సీత కాళ్ళనిండా బురద కొట్టుకుపోయింది.

షాగంజ్ చేరుకోటానికి ఒక పగలు, ఒక రాత్రి పట్టింది. రద్దీగా ఉన్న సన్నటి బజారు వీధుల్లో నడుస్తున్న సీత ఆపాటికి గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

తాత ఆమెను గుర్తు పట్టనేలేదు. అతడు ముందుకు తిన్నగా చూస్తూ బురద కొట్టుకుపోయి, చింపిరిగా ఉన్న ఆ పిల్లను దాటుకుని వెళ్ళిపోయేవాడే. కాని సీత తాతని చూసి పరిగెత్తుకుంటూ వెళ్ళి అతడి నడుమును చుట్టేసింది.

అతడు నిలదొక్కుకుని, ఊపిరి తీసుకుని "సీతా!" అంటూ అరిచాడు. "ఇక్కడికి ఎలా వచ్చావు? దీవి నుంచి ఎలా బయట పడ్డావు? నేను ఎంతో ఆందోళన పడ్డాను – రెండు రోజులు ఎంతో భయంకరంగా గడిచాయి..."

"అమ్మమ్మ బాగానే ఉందా?" సీత అడిగింది.

కాని ఆ మాటలు అంటుండగానే ఇక అమ్మమ్మ తమకి లేదన్న విషయం ఆమెకు అర్థమయ్యింది. ఏ భావమూ లేని తాత చూపులు అంతా చెప్పాయి. ఆమెకి ఏడవాలనిపించింది – అమ్మమ్మ కోసం కాదు, ఇక ఆమెను ఏ బాధలూ చేరలేవు. ఎంతో నిస్సహాయంగా, అయోమయంగా అయిపోయిన తాత కోసం ఏడవాలనిపించింది. అతడు బాధపడటం ఆమెకి ఇష్టం లేదు. కళ్ళల్లో నీళ్ళు కళ్ళలోనే కుక్కుకుంది. మొద్దుబారి, వణుకుతున్న తాత చెయ్యి పట్టుకుని రద్దీగా ఉన్న బజారులో అతడిని ముందుకు నడిపించింది. రానున్న సంవత్సరాలలో తాత తనను ఆసరా చేసుకుని నడవాల్సి ఉంటుందని ఆమెకు అర్థమయ్యింది.

నదిలో వరద తగ్గటానికి కొన్ని రోజులు పట్టింది. అప్పుడు వాళ్ళు తమ దీవికి తిరిగి వెళ్ళారు. ఇంకా వానలు కురిశాయి కాని



గండాలన్నీ గడిచిపోయాయి. తాత దగ్గర ఇంకా రెండు మేకలు మిగిలి ఉన్నాయి – ఒకటి కంటే ఎక్కువ అమ్మవలసిన పని పడలేదు.

దీవిలో చెట్టు లేకపోవటం చూసి తాత ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆ దీవిలో ఆ చెట్టు శాశ్వత గుర్తుగా నిలుస్తుందనిపించేది. నది మాదిరే అది కూడా తన జీవితంలో భాగమని అతడనుకున్నాడు. సీత బతికి బయట పడటం అతనికి అబ్బురంగా అనిపించింది.

"ఆ చెట్టే నిన్ను కాపాడింది," తాత అన్నాడు.

"ఆ అబ్బాయి కూడా," అంది సీత.

అవును, ఆ అబ్బాయి కూడా.

ఆ అబ్బాయి గురించి ఆలోచించింది. మళ్ళీ ఎప్పుడైనా అతడిని చూస్తానా అని సీత అనుకుంది. కానీ దాని గురించి ఎక్కువసేపు ఆలోచించలేదు. చెయ్యటానికి ఎంతో పని ఉంది.

గోనెసంచులతో చేసిన గూడు కింద వాళ్ళు మూడు రోజులు నిద్రపోయారు. మట్టితో తిరిగి గుడిసె కట్టడానికి పగటిపూట తాతకి ఆమె సహాయపడింది. ఈసారి కూడా అదే బండరాయిని ఆధారంగా చేసుకున్నారు.

సీత జాగ్రత్తగా నింపిన ట్రంకు పెట్టె కొట్టుకుని పోలేదు. కాని పెట్టెలోపలికి నీళ్ళు వెళ్ళి ఆహార పదార్థాలు, బట్టలు పాడైపోయాయి. తాత హుక్కా మాత్రం దక్కింది. పని అయిపోయి, సీత తయారుచేసిన కొద్దిపాటి అన్నం తిన్న తరువాత రాత్రుళ్ళు హుక్కా వెలిగించి తాత మునుపటి కొంత తృప్తితో దానిని పీల్చేవాడు. అతడు పిల్లవాడిగా ఉన్నపుడు చూసిన వరదలు గురించి సీతకి ఆ సమయంలో చెప్పేవాడు.

రావిచెట్టు ఉండిన చోట సీత ఒక మామిడి టెంక నాటింది.

అది పెద్ద చెట్టు అవ్వటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. ఆ చెట్టు కొమ్మల్లో కూర్చుని రోజంతా పండ్లు కోసుకుని తింటూ ఆనందిస్తున్నట్లు ఊహించుకోవటం సీతకి ఇష్టంగా ఉండేది. కూరగాయల తోట వెయ్యాలన్న ఆదుర్దాలో తాత ఉన్నాడు. పచ్చి బఠాణీలు, క్యారెట్, శనగ, ఆవాలు విత్తాడు.

కష్టమైన పనులన్నీ పూర్తయ్యి గుడిసె దాదాపు తయారయిన తరువాత సీత ఒక రోజు ఆ అబ్బాయి తనకిచ్చిన వేణువును తీసుకుని నది ఒడ్డుకు వెళ్ళి దానిని ఊదటానికి ప్రయత్నించింది. దాంట్లోంచి కొన్ని శబ్దాలు మించి ఆమె ఊదలేకపోయింది. చివరికి మేకలు కూడా ఆమె సంగీతాన్ని పట్టించుకోలేదు.

ఒక్కొక్కసారి నది ఎగువ నుంచి పడవ ఒకటి వస్తున్నట్లు సీతకి అనిపించేది. దానిని కలుసుకుందామని పరుగులెత్తేసరికి పడవ ఉండేది కాదు. లేదా అది ఏ బెస్తవారిదో, తెలియని వ్యక్తులదో అయి ఉండేది. దాంతో ఆమె పడవల కోసం ఎదురు చూడటం మానివేసింది. అప్పుడప్పుడు ఆమెకు వేణునాదం వినపడుతున్నట్లు అనిపించేది. కానీ అది ఎంతో దూరం నుంచి వినిపించి ఎటునుంచి వస్తోందో తెలిసేది కాదు.

మెల్లగా వానలు ఆగిపోయాయి. వరద నీరు సాంతం తగ్గిపోయింది. ఊళ్ళల్లో ప్రజలు భూములు దున్ని శీతాకాలం పంటలు విత్తటానికి సిద్ధపడుతున్నారు. పశువుల సంతలు, మల్లయుద్ధ పోటీలు జరుగుతున్నాయి. నదిలో నీరు ఇప్పుడు మురికిగా లేకుండా తేటగా ఉంది. ఒక రోజు సాయంత్రం తాత ఒక పెద్ద చేప పట్టి తెచ్చాడు. దానితో సీత రుచికరమైన కూర వండింది.

* * *

తాత హుక్కా పీలుస్తూ గుడిసె బయట కూర్చుని ఉన్నాడు. సీత దీవికి ఆవలి వైపు రాళ్ళమీద బట్టలు ఆరేస్తూ ఉంది. మేకలలో ఒకటి ఆమెను అనుసరించింది. రెండు మేకలలో ఒకటి సీతతో దోస్తీ కట్టి ఎప్పుడూ ఆమె వెంటే తిరుగుతూ ఉండేది. రంగు రంగుల పూసలతో దాని మెడలోకి ఒక దండ తయారుచేసి వేసిందామె.

ఒక నునుపు రాయి మీద సీత కూర్చుంది. అలా కూర్చున్నప్పుడు ఆమె కాళ్ళ దగ్గర ఇసకలో మెరుస్తున్న ఒక వస్తువు కనిపించింది. కొయ్యతో చేసిన రంగుల నెమలి బొమ్మ అది. నదిలో కొట్టుకు వచ్చి ఇక్కడ ఒడ్డుకు చేరి ఉంటుందది. అక్కడక్కడ దాని రంగు కొంత పోయింది. కానీ ఏ బొమ్మలులేని సీతకి అది నిధిలాగా దొరికిందని అనిపించింది. బహుశ మమతలాగా ఇది కూడా తనతో మాట్లాడుతుందేమో.

బొమ్మ నెమలిని అరచేతిలో పెట్టుకుని ఉండగా ఆమెకు మళ్ళీ వేణుగానం వినిపిస్తున్నట్లు అనిపించింది. కాని ఆమె తల ఎత్తి చూడలేదు. అంతకు ముందు ఆ నాదం తనకి వినిపించింది. అంతా తన మనస్సులోనే ఉందన్న అభిప్రాయం ఆమెకి ఏర్పడి పోయింది.

కాని ఈసారి వేణు సంగీతం దగ్గరగా, చాలా దగ్గరగా వినిపించింది. ఇసకలో పడుతున్న అడుగుల మెత్తని సవ్వడి వినిపించింది. తలపైకి ఎత్తి చూసేసరికి ఎదురుగా కిషన్ కనపడ్డాడు.

"నువ్వు ఎప్పటికీ రావేమోనని అనుకుంటున్నాను," అంది సీత.

"వానలు ఆగిపోయేదాకా వేచి ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు ఏ పనులూ లేవు. ఇక నుంచి తరుచూ వస్తుంటాను. నేను ఇచ్చిన వేణువు ఉంచావా?"

"ఆ! కాని నాకు బాగా ఊదటం రాలేదు. ఒక్కొక్కసారి దానంతట



అదే ఊదుతుంటుందనిపిస్తుంది. నా కోసం మాత్రం ఏ సంగీతమూ పలకదు."

"వేణువు ఊదటం నేను నీకు నేర్పిస్తాను," అన్నాడు కిషన్.

అతడు ఆమె పక్కన కూర్చున్నాడు. ఇద్దరూ కాళ్ళను చల్లని ఏటి నీటిలో ముంచారు. నీరు ఇప్పుడు తేటగా ఉండి నీలి ఆకాశాన్ని ప్రతిబింబిస్తోంది. నది అడుగున ఇసక, గులక రాళ్ళు కూడా చక్కగా కనపడుతున్నాయి.

"ఒక్కొక్కసారి నదికి కోపం వస్తుంది, ఒక్కొక్కసారి అది ఎంతో దయ చూపిస్తుంది," అంది సీత.

"మనం ఈ నదిలో భాగం," అన్నాడా అబ్బాయి, "అది లేకుండా మనం బతకలేం."

అది మంచి నది. లోతైనది, బలమైనది. కొండలలో పుట్టి సముద్రంలో కలుస్తుంది.

వందల మైళ్ళ మేర ఉన్న దాని ఒడ్డు వెంబడి లక్షలాది ప్రజలు నివసిస్తున్నారు. వాళ్ళలో సీత ఒక చిన్న పిల్ల మాత్రమే. ఆమె గురించి ఎవరూ వినలేదు, ఆమె గురించి ఎవరికీ తెలియదు – తాతకి, ఆ అబ్బాయికి, నదికి తప్పించి.

* * *